ప్రజాశక్తి

ఆదివారం 27 జులై 2025

5

విజయనగరం

'మీ కోసం' సేవలకు 1100

కాల్‌సెంటర్‌ను వినియోగించుకోవాలి : ఇన్‌ఛార్జి కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీదారులు మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్ సేతు మాధవన్ సూచించారు. తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించ వచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

బోధనేతర పనుల భారం తగ్గించాలి

కేడర్ స్ట్రెంత్ సమస్యను పరిష్కరించాలి ● కలెక్టరేట్ వద్ద యుటిఎఫ్ ధర్నా

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయులకు బోధనేతర పనుల భారం తగ్గించాలని, కేడర్ స్ట్రెంత్ సమస్యను పరిష్కరించాలని, బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు శనివారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ధర్నానుద్దేశించి యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె శ్రీనివాసరావు,జెఎవిఆర్ కె ఈశ్వరరావు, రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, డి.రాము మాట్లాడారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నాటి నుండి ఉపాధ్యాయులు బోధనకంటే బోధనేతర పనులకే ఎక్కువ సమయం కేటాయించవలసి వస్తున్నదని, ముఖ్యంగా యోగాంధ్ర, మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం, శిక్షణా తరగతులు పేరుతో అనేక కార్యక్రమాలు ఉపాధ్యాయులను బోధనకు దూరం చేసాయని యుటిఎఫ్ నాయకులు అన్నారు. ఇవి కాకుండా ప్రతీరోజూ ఏదో ఒక సమాచారం విద్యాశాఖ అత్యవసరమంటూ యాప్‌లో అప్‌లోడ్ చేయమంటున్నదని తెలిపారు. ఇలా ఏదో ఒక పని అప్పగించి విద్యార్థులకు పాఠాలు చెప్పనీయకుండా చేస్తున్నారని అన్నారు.

ఉపాధ్యాయులకు ఏ మాత్రం సంబంధంలేని '24' వంటి విషయాలు కూడా ఉపాధ్యాయులపై మోపుతున్నారన్నారు. బదిలీలు జరిగే నెలరోజులైనా వేలాది మంది రిలీవింగ్‌కు నోచుకోలేదన్నారు. పేరుకు ఐదుగురు టీచర్లను ఇచ్చినా పలు పాఠశాలల్లో ఇద్దరే పనిచేస్తున్నారన్నారు. మరోవైపు ఉపాధ్యాయులు సెలవులు వినియోగించుకునే స్వేచ్ఛ లేకుండా ఆంక్షలు విధిస్తున్నారన్నారు. ఉపాధ్యాయులకు 2 నెలలుగా చెల్లించవలసిన జీతాల సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో అందోళన మరింత తీవ్రతరం చేస్తామన్నారు. ధర్నాలో యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు జె ఆర్ సి పట్నాయక్, కోశాధికారి భాస్కరరావు, జిల్లా కార్యదర్శులు కె.ప్రసాదరావు, శ్రీదేవి, సిహెచ్ తిరుపతి నాయుడు, ఎన్.సత్యన్నారాయణ, రాజారావు, అల్లు శంకరరావు ,సత్య శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోవా గవర్నర్‌గా అశోక్ ప్రమాణ స్వీకారం

గోవా గవర్నర్‌గా పూసపాటి అశోక్ గజపతిరాజు ప్రమాణ స్వీకారం చేశారు. గోవా రాజ్‌భవన్‌లో ఈ కార్యక్రమం శనివారం వైభవంగా సాగింది. గోవా సిఎం ప్రమోద్ సావంత్, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎపి అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు నారా లోకేష్, కొండపల్లి శ్రీనివాస్, జి.సంధ్యారాణి, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరై, అశోక్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు

- ప్రజాశక్తి, విజయనగరం కోట

అశోక్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న గోవా సిఎం ప్రమోద్

గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న అశోక్

అశోక్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ; ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, నాయకులు

ప్రతి ఉద్యోగీ 'బంగారు కుటుంబాలు'ను దత్తత తీసుకోవాలి

ఇన్‌ఛార్జి కలెక్టర్ సేతు మాధవన్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ సేతు మాధవన్

ప్రజాశక్తి-విజయనగరంకోట

పి4 కార్యక్రమంలో ప్రతి ఉద్యోగి బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని మార్గదర్శులుగా నిలవాలని ఇంఛార్జి జిల్లా కలెక్టర్ సేతు మాధవన్ పిలుపునిచ్చారు. పి4 కార్యక్రమంపై శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా, డివిజన్, మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఆగస్టు 15 నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని ముఖ్యమంత్రి అదేశించారని తెలిపారు. జిల్లాలో గల అధికారులు, వారి సిబ్బంది ఒకటి కంటే ఎక్కువ కుంటుంబాలను దత్తత తీసుకోవాలని తెలిపారు. సమాజంలో 20శాతం ఉన్నత వర్గాల వారు 20 శాతం అట్టడుగు వర్గాల వారిని దత్తత తీసుకొని పేదరికం నుండి బయటకు తీసుకువచ్చేందుకు జిల్లాకు నిర్దేశించిన 67వేల లక్ష్యం మేరకు ప్రతి గ్రామంలో బంగారు కుటుంబాలు, మార్గదర్శులను గుర్తించాలని తెలిపారు. ఈ స్వచ్ఛంద కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని తెలిపారు. ఆగస్టు 15న ప్రారంభమయ్యే కార్యక్రమానికి వచ్చేనెల 5లోగా బంగారు కుటుంబాలను, మార్గదర్శులను గుర్తించి నమోదు చేయాలని తెలిపారు. పరిశ్రమలు, పారిశ్రామికవేత్తలు, ఉద్యోగులే కాకుండా ఇతర రంగాలకు చెందిన వారు కూడా వారి వద్ద పనిచేస్తున్న కుటుంబాలను లేదా ఇతర పేద కుటుంబాలను దత్తత తీసుకొని ఆర్థిక, ఆర్థికేతర అంశాలలో సహాయం, తోడ్పాటు అందించేలా అవగాహన కల్పించాలని తెలిపారు.

విద్యార్థి.. ఉపాధ్యాయుడు.. ఓ పాఠశాల

ప్రజాశక్తి-వేపాడ

విద్యార్థిని దగ్గర పెట్టుకుని, ఉపాధ్యాయుడు పాఠాలు బోధిస్తున్న ఈ పాఠశాలకు ఓ ప్రత్యేకత ఉంది. వేపాడ మండలం వావిలపాడు పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామమైన కడకొండలోని ప్రాథమిక పాఠశాల ఇది. ఈ గ్రామంలో సుమారు 40 కుటుంబాలు ఉన్నాయి. గతేడాది వరకు ఈ పాఠశాలలో నలుగురు విద్యార్థులుండేవారు. వారంతా దేవరాపల్లి మండలంలోని పాఠశాలలో ఆరో తరగతిలో చేరారు. దీంతో విద్యార్థులు లేక 40 ఏళ్ల నాటి పాఠశాల మూతపడే స్థితికి చేరింది. అలాంటి తరుణంలో అంగన్వాడీ కేంద్రం నుంచి మోక్షజ్ఞ అనే విద్యార్థి ఈ పాఠశాలలో ఒకటో తరగతిలో చేరాడు. దీంతో బడి తలుపులు తెరుచుకున్నాయి. నవీన్ అనే ఉపాధ్యాయుడిని విద్యాశాఖాధికారులు ఇక్కడికి డెప్యుటేషన్‌పై పంపిస్తున్నారు. ఒకే ఒక్క విద్యార్థి ఉన్నా.. ఆయన ఏమాత్రమూ విసుగు లేకుండా దగ్గర పెట్టుకుని మరీ విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు.

విద్యార్థికి పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు నవీన్

రైతు బజారు భూమి రక్షణకు

28న రౌండ్‌టేబుల్ సమావేశం

పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పాత ఆసుపత్రి వద్ద ఉన్న ప్రభుత్వానికి చెందిన రైతు బాజార్ స్థలాన్ని రక్షించుకునేందుకు ఈనెల 28న రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి ప్రజాసంఘాలు, ప్రజల మద్దతు కోరుతామని పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకరరావు తెలిపారు. శనివారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముందుగా రౌండ్ టేబుల్ సమావేశం గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుబజార్ భూమి 22ఎ నుంచి తప్పించి ప్రభుత్వ భూమిని రాజులకు అప్పగించిన అధికారుల తీరు అన్యాయమన్నారు. సంస్థానాలు అధీనంలో ఉన్న రైతుబజార్ భూమి సంస్థానాలు రద్దు అయిన తర్వాత ప్రభుత్వం భూమిగా మారిపోయిందన్నారు. 1948లో జమిందాదీ వ్యవస్థ రద్దు చేసి భూములన్నీ రైతువారి పద్ధతిలోకి వచ్చాయని తెలిపారు. 1968 లో ల్యాండ్ సీలింగ్ చట్టం వచ్చిన తర్వాత ప్రభుత్వం చేతిలో లేదా మాన్సాస్ ట్రస్టు చేతిలో ఉన్నాయి తప్ప రాజులు చేతిలో ప్రత్యేకంగా భూములు ఏమీ లేవన్నారు. కానీ ఆ భూములు తమవని చెప్పి చీకటి జీవోలు తెచ్చి అశోక్ గజపతిరాజు, వారసులు కలిపి భూములన్నీ కాజేయాలని చూస్తున్నారన్నారు. చీకటి జీఓ లు రద్దు చేసి ఆ భూమిని రైతులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. జొన్నగుడ్డిలో పేదలకు పట్టాలు ఇచ్చిన భూమిని ఆ దళితులకు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు.

నగరంలో ఉన్న చారిత్రిక కట్టడాలైన ఎమ్మార్ కాలేజీ, మహారాజు ఆసుపత్రి, మ్యూజిక్ కాలేజీ, సింహాచలం మేడ ఇవన్నీ కూడా తీసుకోరని గారంటీ ఏమిటని ప్రశ్నించారు. సింహాచలం మేడను ఎందుకు కూలగొడుతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. చారిత్రిక కట్టడాలు, ప్రభుత్వ భూమి రక్షణ కోసం 28 న రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశామని, ప్రజలు,ప్రజా సంఘాలు పాల్గొని మద్దతివ్వాలని కోరారు. సమావేశంలో ఆ సంఘం నాయకులువి.రామచంద్రరావు, సతీష్ పాల్గొన్నారు.

మ్యుటేషన్ ప్రక్రియపై విస్తృత అవగాహన

కమిషనర్ నల్లనయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర పరిధిలో ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియకు మ్యుటేషన్ విధానం ఆగస్టు ఒకటో తేదీ నుండి రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకురానున్నదని, కావున ప్రజలలో విస్తృత అవగాహన కల్పించాలని అడ్మిన్ కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. శనివారం కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ శిబిరంలో కార్యదర్శుల నుద్దేశించి మాట్లాడారు. నగర ప్రాంతంలో భూములు, భవనాల రిజిస్ట్రేషన్ అనంతరం ఆస్తి వివరాలు ఆటో మ్యుటేషన్ ప్రక్రియ సంబంధించి మున్సిపల్ కార్పొరేషన్ రికార్డులలో పేరు మార్పు అవుతాయని పేర్కొన్నారు. పురపాలక శాఖ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ సమన్వయంతో ఈ విధానాన్ని ప్రభుత్వం అమలు చేయనున్నదని చెప్పారు. దీని వల్ల రిజిస్ట్రేషన్ తర్వాత ఆస్తిని పురపాలక రికార్డుల్లో నేరుగా నమోదు చేసుకోవలసిన అవసరం ఉండదన్నారు. ఆస్తి వివరాలు, పన్నుల నమోదు ఆటోమేటిక్ గా చేరతాయని తెలిపారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, సబ్ రిజిస్ట్రార్లు ప్రసాదు, రమేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

గిరిజన సమస్యలపై విశేష కృషి

రాష్ట్ర ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డివిజి శంకరరావు ● నేటితో ముగియనున్న ఛైర్మన్ పదవీ కాలం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

తన రెండేళ్ల పదవీకాలంలో గిరిజనుల సమస్యల పరిష్కారానికి విశేషంగా కృషి చేశామని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ డివిజి శంకరరావు చెప్పారు. ఈ నెల 27తో తమ పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో, ఆయన స్థానిక జెడ్‌పి అతిది గృహంలో శనివారం మీడియాతో మాట్లాడారు. ఈ రెండేళ్లలో చేసిన కృషిని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా పర్యటించామని, గిరి శిఖర గ్రామాలకు సైతం వెళ్లి గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నామని ఛైర్మన్ అన్నారు. సమస్యలను పరిష్కరించడమే కాకుండా, గిరిజనుల హక్కులను కాపాడటానికి ప్రయత్నించామని తెలిపారు. సమస్యల పరిష్కారానికి, హక్కుల పరిరక్షణకు ఎస్‌టి కమిషన్ ఉందన్న భరోసాను రాష్ట్రంలోని గిరిజనులకు కల్పించినట్లు తెలిపారు. నెల్లూరు, చిత్తూరు జిల్లాలో నిర్వహిస్తున్న వెట్టిచాకిరీపై పత్రికల్లో వార్తలను సుమోటోగా స్వీకరించి, దానిని నిర్మూలించేందుకు కృషి చేశామన్నారు. అంతేకాకుండా దానికి మూలాలను సైతం అన్వేషించి, పరిష్కారానికి పలు సిఫార్సులు చేశామని తెలిపారు. పలు గిరిజన ప్రాంతాలకు రహదారుల సౌకర్యాన్ని కల్పించామన్నారు. విద్య, వైద్య సదుపాయాలు సరిగ్గా లేకపోవడం, నిరుద్యోగితతో గిరిజనులు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారని గుర్తించామని, వాటి పరిష్కారానికి పలు సిఫార్సులను చేశామని తెలిపారు. మైదాన ప్రాంతంలోని గిరిజనుల సమస్యల పరిష్కారానికి కూడా కమిషన్ పనిచేసిందని వివరించారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి ఎస్‌టి కమిషన్ ఛైర్మన్‌గా నియమించిన గత ప్రభుత్వానికి, తమకు అన్నివిధాలా సహకరించి, సిఫార్సుల పట్ల సానుకూలంగా స్పందించిన ప్రస్తుత ప్రభుత్వానికి ఈ సందర్భంగా శంకర్‌రావు కతజ్ఞతలు తెలిపారు. గిరిజన యువతకు ఉద్యోగావకాశాలు కలిగేలా బ్యాక్ లాగ్ పోస్ట్ లను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగ నియామకాలకు సంబంధించి రోస్టర్ విధానాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి కమిషన్ సూచించిందన్నారు. సివిల్ ,ఎలక్ట్రానిక్స్ , మెకానికల్ వంటి బ్రాంచ్ లలో డిగ్రీ లను పూర్తి చేసిన యువతకు స్వయం ఉపాధి కల్పనకు సబ్సిడీ లను అందించి ప్రోత్సహించాలన్నారు.జిసిసిల్లో అనేక పోస్ట్‌లు భర్తీ చేయని పరిస్థితి కమిషన్ గమనించి, ఆ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. గిరిజన ఉత్పత్తులను నిల్వ వుంచేందుకు కోల్డ్ స్టోరేజ్ లను ఏర్పాటు చేయాలన్నారు. గిరిజనుల్లో వ్యవసాయదారుల తమ పంటలను అమ్ముకునేందుకు గిరిజన రైతు బజార్ లను ఏర్పాటు చేయాలని సూచించడం జరిగిందని తెలిపారు. గిరిజనులకు వైద్యసేవలు అందించేందుకు పిహెచ్‌సి, సిహెచ్‌సిలలో పోస్ట్‌లను భర్తీ చేయాలని కోరారు. గిరిజన విశ్వ విద్యాలయంలో గిరిజనులకు 7.5 శాతం సీట్లను కేటాయిస్తున్నారని, అయితే గిరిజనుల విద్యను ప్రోత్సహించేందుకు రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరామన్నారు. షెడ్యూల్ ప్రాంతాల ఉద్యోగాల్లో స్థానికులకు 100 శాతం ఉద్యోగాలకు హామీ ఇచ్చే జీవో 3 రద్దు నేపథ్యంలో అక్కడ స్థితిగతులపై సర్వే చేసి ఆ చట్టాన్ని పునరుద్ధరించాలని కోరారు.

మాట్లాడుతున్న డివిజి శంకరరావు

పోలీసుశాఖలో కారుణ్య నియామకాలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లా పోలీసుశాఖలో ఆర్మడ్ రిజర్వు విభాగంలో కానిస్టేబులుగా పని చేస్తూ, అనారోగ్యంతో విధులు నిర్వహించలేని కారణంతో ఉద్యోగ విరమణ చేసిన సిహెచ్.ఈశ్వరరావు కుమారుడు సిహెచ్.తేజను జూనియర్ సహాయకులుగా జిల్లా పోలీసు కార్యాలయంలో నియమిస్తూ ఎస్పి వకుల్ జిందాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు వారికి ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ వివిధ కారణాలతో మృతి చెందిన పోలీసు కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని, వారి కుటుంబంలోని వ్యక్తికి కారుణ్య ఉద్యోగ నియామక ఉత్తర్వులను అందజేసామన్నారు. నూతనంగా ఉద్యోగం పొందిన సిహెచ్.తేజను అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) పి.సౌమ్యలత, డిపిఒ సూపరింటెండెంట్ వెంకటలక్ష్మి, జూనియర్ సహాయకులు చాముండేశ్వరి, పోలీసు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తర్వులు అందజేస్తున్న ఎస్పి వకుల్ జిందాల్

నేటి నుంచి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్న డిపార్ట్‌మెంటల్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని, వివిధ శాఖల అధికారులను జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై తన ఛాంబర్‌లో శనివారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో వ్యవహరించి, పరీక్షలను విజయవంతంగా నిర్వహించాలని, అభ్యర్థులకు ఎటువంటి లోటుపాట్లు రాకుండా చూడాలని కోరారు. సెల్‌ఫోన్లు ఇతర ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి అవకతవకలు చోటుచేసుకున్నా, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటిండెంట్లే బాధ్యత వహించాల్సి ఉంటుందని డిఆర్ఓ స్పష్టం చేశారు. ఈ పరీక్షలు ఎపిపిఎస్‌సి ఆధ్వర్యంలో ఈనెల 27 వ తేదీ నుంచి ఆగస్టు 1 వరకు, అయాన్ డిజిటల్, లెండి కళాశాలలో జరుగుతాయని చెప్పారు. సమావేశంలో ఎపిపిఎస్‌సి సెక్షన్ ఆఫీసర్లు పివి నవజ్యోతి, ఎ.నాగలక్ష్మి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ భాస్కర్రావు, డిఎస్‌పి ఎం.వీర్‌కుమార్, డాక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు

కష్టజీవుల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు

ప్రజాశక్తి-బొబ్బిలి

చట్టసభలలో కమ్యూనిస్టులకు ప్రాతినిధ్యం లేకపోయినా కష్టజీవుల పక్షాన పోరాటం చేస్తున్నారని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు అన్నారు. సిపిఐ జిల్లా మహాసభ సందర్భంగా శనివారం పట్టణంలో భారీ ర్యాలీ చేసి, తాండ్ర పాపారాయ విగ్రహం జంక్షన్ వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి రాజకీయాలలో నిజాయతీ లేదని, అధికారం కోల్పోయిన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్పిలు.. అధికార పార్టీలో చేరి దిగజారి పోతున్నారని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపును వ్యతిరేకించిన బిజెపి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత విపరీతంగా వాటి ధరలు పెంచి ప్రజలను దోపిడీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. లీటరు పెట్రోల్ రూ.70, డీజిల్ రూ.60, గ్యాస్ సిలిండర్ రూ.500కే ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనని బిజెపి, ఆర్ఎస్ఎస్ వాదులు.. నేడు దేశభక్తులనడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో గతంలో వైసిపి, నేడు టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజలకు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. సభలో సిపిఐ రాష్ట్ర నాయకులు కామేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, నియోజకవర్గ కార్యదర్శి కె.ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

17న ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి పట్టణంలో ఆగస్టు 17న జరిగే ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో మహాసభ వాల్‌పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు పని చేస్తున్న ఆశా కార్యకర్తలకు కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. ఆశాలను కార్మికులుగా గుర్తించడం లేదన్నారు. డెత్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించడం లేదని చెప్పారు. మహాసభలో ఆశా కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. మహాసభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎల్.శాంతమ్మ, ఎం.లక్ష్మి, పి.కృష్ణవేణి, కె.నాగరత్నం, పి.భార్గవి, సిఐటియు నాయకులు చెంచు లక్ష్మి పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లు ఎవరి కోసం?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఇటీవల కాలంలో ఇళ్లకు విద్యుత్‌శాఖ అధికారులు స్మార్ట్ మీటర్లు అమరుస్తున్నారు. వీటిని ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. అక్కడక్కడా విద్యుత్ వినియోగదారుల ఆగ్రహం కూడా పెల్లుబుకుతోంది. ఇంతకీ ఏమీటీ స్మార్ట్ మీటర్లు, ఎందుకు అమరుస్తున్నట్టు, పాతవాటిని తొలగించాల్సిన అవసరం ఏమొచ్చింది. దీనిపై సిపిఎం ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యాన ఇటీవల ప్రచారం పెరగడంతో ప్రభుత్వ బండారాన్ని ఇప్పుడిప్పుడే ప్రజలు తెలుసుకుంటున్నారు. కాయకష్టం చేసుకుంటూ ఇతర అంశాలపై కాస్త అవగాహన లేనివారి నుంచి కూడా ఇదే సందేహాలు వ్యక్తమౌతోంది. స్మార్ట్ మీటర్లు అంటే పాత మీటర్లు తొలగించి, ఆధునిక సాంకేతికతో కూడా పరికరాలు మాత్రమే అనుకుంటే పొరపాటేనని రాజకీయాలు, విద్యుత్ సంస్కరణలపై కాస్త అవగాహన ఉన్నవారు చెబుతున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. ఇప్పటి వరకు విద్యుత్ వినియోగం తరువాత బిల్లులు వస్తున్నాయి. ఆయా ఛార్జీలను చెల్లించుకునేందుకు గడువు ఉండేది. ఆ తరువాత కూడా ఫైన్‌తో చెల్లించుకోవచ్చు. అప్పటికీ చెల్లించకపోతే విద్యుత్ శాఖ సిబ్బంది పవర్ కట్ చేస్తారు. కాబట్టి, పరిస్థితి ఇంత వరకు తెచ్చుకోవడానికి ఏ వినియోగదారులు కూడా సాహశించే పరిస్థితి ఉండబోదు. అదే వీటి స్థానాల్లో అదానీ స్మార్ట్ మీటర్లు అమర్చాక సెల్ ఫోన్‌కు రీఛార్జి చేయించుకున్న మాదిరిగా ముందస్తుగానే బిల్లు చెల్లించాల్సివుంటుంది. ఆ మేరకు విద్యుత్ వినియోగం పూర్తికాగానే పవర్ కట్ అవుతుంది. అప్పటికప్పుడు వినియోగదారులు డిజిటల్ బ్యాంకు ఖాతా ద్వారా నగదు చెల్లించుకుంటే సరేసరి. లేదంటే అంధకారాన్ని అనుభవించాల్సిందే. ఒకవేళ చేతిలో నగదు ఉన్నా ఇప్పటికప్పుడు విద్యుత్ పునరుద్ధరణ జరిగే పరిస్థితి ఉండబోదు. ఇప్పటికే ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్లు గతంతో పోలిస్తే అధిక వినియోగాన్ని, బిల్లులను చూపుతున్నాయని వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. ఈ విషయాలన్నీ ఎవరో చేస్తున్న విమర్శలో, ఆరోపణలో కాదు సుమా? స్మార్ట్ మీటర్ల విధానంలోనే ఉన్నాయి. దీన్నే మారుతున్న టెక్నాలజీ అంటూ పాలకులు కొత్త భాష్యం చెబుతున్నారు. కేవలం విద్యుత్ సరఫరా, అర్థాంతరంగా కోతకు సంబంధించి మాత్రమే కాదు. ఏ వినియోగదారుడు ఏ సమయంలో విద్యుత్‌ను ఎక్కువగా వినియోగిస్తున్నారనేది ప్రభుత్వానికి మాత్రమే కాదు. స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్న బడా కార్పొరేట్ కంపెనీలకు స్పష్టంగానే అర్థమౌతుంది. దీని ఆధారంగా ప్రజలు ఏయే అవసరాలకు ఎంత వినియోగిస్తున్నారన్నదాని ప్రకారం ప్రజల అభిరుచులకు అనుగుణంగా ఎలక్ట్రికల్ పరికరాలు, వస్తు సామగ్రి విక్రయానికి పెట్టుకోవడానికి కూడా వీలు కలుగుతుంది. వీటన్నింటికీ మించి స్మార్ట్ మీటర్ల పేరిట వాటిని సరఫరా చేస్తున్న కంపెనీలకు ప్రభుత్వం రూ.వేల కోట్ల ప్రజాధనం అప్పనంగా కట్టబెడుతోంది. ఇలా ఈ స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలకు కష్టం, నష్టం, విద్యుత్ సరఫరాల అంతరాయం, అసౌకర్యం కలగడం, ప్రజాధనం లూటీ కావడం మినహా ఒరిగిందేమీ లేదని విద్యుత్ రంగ నిపుణులు సహా నెత్తీనోరు కొట్టుకుంటున్నారు. మరోవైపు స్మార్ట్‌మీటర్ల బిగించిన వారికి నెలవారీ బిల్లుల్లో యూనిట్లు చూపించడం లేదు. వినియోగదారుడికి ఎంత బిల్లు కట్టాలో మాత్రమే మెసేజ్ వస్తుంది. దీంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి ఈ విధానం ఇప్పటికిప్పుడు వచ్చిందేమీ కాదు. గత వైసిపి ప్రభుత్వమే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యుత్ సంస్కరణలను అమలు చేసింది. నాటి నుంచి సిపిఎం వ్యతిరేకిస్తూ వస్తోంది. గడిచిన ఎన్నికల్లో టిడిపి కూడా దీన్ని వ్యతిరేకించింది. బలవంతంగా పెట్టడానికి ప్రయత్నిస్తే వాటిని ధ్వంసం చేయాలంటూ ఎన్నికల ప్రచారానికి వచ్చిన టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కూడా పిలుపునిచ్చారు. ప్రస్తుతం అదే లోకేష్, అదే టిడిపి, జనసేన కూటమి స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు తహతహలాడుతోంది. ఈనేపథ్యంలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సిపిఎం పెద్దఎత్తున ప్రచారం చేస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో

ప్రజాశక్తి
www.prajasakti.com

నానో ఎరువులను ప్రదర్శిస్తున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు

నానో ఎరువులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- డెంకాడ(భోగాపురం)

నానో ఎరువులపై రైతులకు అవగాహన అవసరమని ఎపి మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. భోగాపురం మండలంలోని ఆయన స్వగ్రామం పోలిపల్లిలో నానో ఎరువులపై రైతులకు అవగాహన కల్పించడానికి ఇఫ్కో మేనేజర్ జగదీష్ మిశ్రా కర్రోతును శనివారం కలిశారు. ఈ సందర్భంగా మిశ్రా మాట్లాడుతూ రైతులందరూ తప్పకుండా నానో ఎరువులను వాడుకోవాలని ఒక బస్తా యూరియాకు ఒక అర లీటర్ నానో యూరియా సమానమని అన్నారు. ఒక బస్తా 50 కేజీల డిఎపికి ఒక అర లీటర్ నానో డిఎపి సమానమని ఇవి బాగా పనిచేస్తాయని చెప్పారు. వీటితో పాటు ఖరీఫ్ సీజన్ నుండి నానో జింక్, నానో కాపర్ కూడా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డిఎం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 715 మంది ఎంపిక

ప్రజాశక్తి- డెంకాడ(భోగాపురం)

భోగాపురం మండలంలోని ముంజేరులో ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాకు స్పందన లభించింది. నైపుణ్యాభివృద్ధి శాఖ సహకారంతో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో సుమారు 2500 మంది యువత హాజరై, తమ ప్రతిభను ప్రదర్శించి సాఫ్ట్‌వేర్, హెల్త్‌కేర్, ఫైనాన్స్, మాన్యుఫాక్చరింగ్, కస్టమర్ సపోర్ట్ వంటి వివిధ్న రంగాలకు చెందిన సంస్థలకు 715 మంది ఎంపికయ్యారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఎమ్మెల్యే చేతులు మీదుగా ఆఫర్ లెటర్లు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత నేర్చుకుంటూ ముందుకు సాగితే, అవకాశాలు స్వయంగా వస్తాయన్నారు. నైపుణ్య అభివృద్ధి ద్వారా మాత్రమే స్థిరమైన భవిష్యత్తు సాధ్యమని తెలిపారు.

నేడు విద్యుత్తు అంతరాయం

నెల్లిమర్ల : నెల్లిమర్ల పారిశ్రామిక ప్రాంతం సబ్ స్టేషన్, టిడ్కో సబ్ స్టేషన్ ఫీడర్, 11కెవి పారిశ్రామిక ప్రాంతం పరిధిలో ఆదివారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని విజయనగరం టౌన్ డిఇఇ పి.త్రినాధరావు ప్రకటనలో తెలిపారు. నెల్లిమర్ల పారిశ్రామిక ప్రాంతం, టిడ్కో సబ్ స్టేషన్ పరిధి మిమ్స్ 11కెవి, సారిపల్లి రూరల్ ఫీడర్, పిటిసి 11కెవి ఫీడర్, నీలంరాజు పేట, ఎల్‌టి లైన్ పనులు ప్రారంభం, స్థంబాలు వేయడం, లైన్ కలపడం, చెట్టుకొమ్మలు తొలగించడం, సాంకేతిక సమస్యలు పరిష్కారం నిమిత్తం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడనుందని తెలిపారు.

తొలకరి వర్షాలపై అప్రమత్తం

కొత్తవలస : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, వాతావరణం మార్పుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిహెచ్‌సి వైద్యాధికారి డి.సీతల్‌వర్మ తెలిపారు. శనివారం వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. దోమతెరలు వాడాలని, ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. జ్వరం, వాంతులు, విరోచనాలు వంటివి సంక్రమిస్తే వెంటనే స్థానిక వైద్య సిబ్బందికి తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో సిహెచ్‌ఓ అప్పలకొండ, ఇఒ సన్యాసినాయుడు, హెచ్‌ఓ బేబీరాణి, నిర్మల, హెచ్‌ఎస్ సూరిదేముడు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమర్థవంతంగా ప్రీ స్కూల్ విద్య

గంట్యాడ : ప్రీ స్కూల్ విద్యను సమర్థవంతంగా అందించాలని ఐసిడిఎస్ సిడిపిఒ ఉమాభారతి తెలిపారు. గొటియాడ గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో శనివారం ఇసిసిఇ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రీస్కూల్ పిల్లలకు ఆటపాటల ద్వారా విద్యను అందించాలన్నారు. గర్భిణులు, బాలింతలపై దృష్టిపెట్టి, పౌష్టికాహారాన్ని అందించాలని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అనురాధ, మహిళా సంరక్షణ కార్యదర్శి రాజేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు వెంకటలక్ష్మి, ఉమ పాల్గొన్నారు.

వీలుపర్తిలో డిఎల్‌పిఒ పర్యటన

వేపాడ : వీలుపర్తి పంచాయతీలో డిఎల్‌పిఒ శిరీషారాణి శనివారం పర్యటించారు. కాలువలో పైప్‌లైను ఉండకూడదని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. చెత్త వీధిలో, రోడ్లపై వేయరాదని ప్రజలకు తెలిపారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. తొందరగా వర్మీ కంపోస్టు రిలీజ్ చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలన్నారు. డిప్యూటీ ఎంపిడిఒ, సర్పంచ్ పాల్గొన్నారు.

బానాదిలో పశువైద్య శిబిరం

వేపాడ :మండలంలోని బానాది గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల ప్రభావం, సమర్థతను పరీక్షించేందుకు 26 పశువుల నుంచి పశువైద్యాధికారి కోరాడ గాయత్రి రక్త నమూనాలు సేకరించారు. రైతులకు వర్షాకాలంలో పశువులు, జీవాల యాజమాన్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పశుగ్రాస పెంపకం వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. పశువైద్య సిబ్బంది, పశుసంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.

పలువురికి ఎమ్మెల్సీ పరామర్శ

వంగర : మండలంలోని నీలయ్యవలస గ్రామానికి చెందిన చింతగుంట రామారావు కాలికి గాయమై దీర్ఘకాలంగా బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శనివారం ఆయన్ను పరామర్శించారు. వంగరలో రౌతు సూరి నాయుడు, రౌతు రాముడమ్మ ఇటీవల మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, వైసిపి మండల అధ్యక్షులు కరణం సుదర్శనరావు, మహిళా సమైఖ్య అధ్యక్షులు కాంబోతుల భగవతి, తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు సిద్ధం

నెల్లిమర్ల : మొక్కజొన్న, వరి నారు మడికి సరిపడా ఎరువులు సిద్ధంగా ఉన్నాయని ఎఒ పి.శ్రీలక్ష్మి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ మొక్క జొన్న, వరి నారుమడికి సరిపోయినంత ఎరువులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. మండలంలో యూరియా 180 టన్నులు, డిఎపి 100 టన్నులు, కాంప్లెక్స్ 160 టన్నులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.
ఈ ఏడాది 300 టన్నుల యూరియా, 200 టన్నుల డిఎపి ఇండెంట్ పెట్టామని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఆర్ఎస్‌కెలో 80 టన్నుల యూరియా ఉందని తెలిపారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

లక్కవరపుకోట : ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పది మందికి ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పంపిణీ చేశారు. శనివారం లక్కవరపుకోటలోని తన నివాసం వద్ద రూ.10,44,670 చెక్కులను ఆమె లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

నెల్లిమర్ల : మండలంలోని బుచ్చెన్నపేటకు చెందిన బొంతు భాస్కరరావుపై పోక్సో కేసు నమోదైంది. బాలికను పెళ్లి చేసుకుంటాననని నమ్మించి ఇంటి నుంచి తీసుకొని వెళ్లిపోవడంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతనిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.గణేష్ తెలిపారు.

సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేయాలి

శృంగవరపుకోట : ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని దళిత ఉద్యమ నేత ఆతవ ఉదయ భాస్కర్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్‌సి కార్పొరేషన్ రుణాలు, కులాంతర వివాహాల పారితోషకాలు, ఇలా అనేక పథకాలు మంజూరు కాకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు.

అభివృద్ధే లక్ష్యంగా పాలన : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుర్ల

అభివృద్ధి లక్ష్యంగానే కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎమ్మెల్యే కళా వెంకటరావు తెలిపారు. శనివారం చింతపల్లి పేట గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించి ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అందించిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలను సాగిస్తుందని అన్నారు. ప్రతి సంక్షేమ పథకం అర్హులైన వారికి అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు వెన్ని సన్యాసినాయుడు, తిరుమల రాజు కిరణ్ కుమార్, చనమల్లు మహేశ్వర రావు, కె.త్రిమూర్తుల రాజు, సంచాన సన్యాసినాయుడు, మండల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్లు

బొబ్బిలి : పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. పట్టణంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే శనివారం తనిఖీ చేశారు. భోజనాల్లో నాణ్యత పాటించాలని నిర్వాహకులకు సూచించారు. భోజనం, టిఫిన్ నాణ్యతపై అక్కడ భోజనాలు చేస్తున్న వారిని అడిగి తెలుసుకున్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

స్థానిక కోటలో సిఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే బేబినాయన పంపిణీ చేశారు. 11 మందికి రూ.18 లక్షలను అందజేశారు. పేదలకు సిఎం సహాయనిధి ఎంతో దోహదం చేస్తుందని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సొసైటీ అభివృద్ధికి కృషి : పిఎసిఎస్ చైర్‌పర్సన్

ప్రజాశక్తి- గుర్ల

మండలంలోని కెల్ల పిఎసిఎస్ చైర్‌పర్సన్‌గా కొలుకులూరి విమలారాణి శనివారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామమల్లిక్ నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామమల్లిక్ నాయుడు మాట్లాడుతూ రైతులకు విశేషంగా సేవలందించాలన్నారు. ఖరీఫ్ సీజన్ ఆరంభం కావడంతో రైతులకు ఎరువులు సకాలంలో అందించేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలకు తోడుగా సొసైటీ ద్వారా రైతుల శ్రేయస్సుకోసం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ వెన్ని సన్యాసినాయుడు, టిడిపి నాయకులు త్రిమూర్తులు రాజు, కిరణ్ బాబు, టిడిపి మండల అధ్యక్షులు సిహెచ్ మహేష్ రావు, సిఇఒ మండల శ్రీను, సొసైటీ డైరెక్టర్‌లు జి.రామచంద్రరాజు, రమణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చైర్‌పర్సన్ విమలారాణి, పాలకవర్గాన్ని సత్కరిస్తున్న నాయకులు

రాకపోకలకు ఆటంకం కలిగిస్తే చర్యలు

ప్రజాశక్తి - చీపురుపల్లి

పట్టణంలో ప్రధాన రహదారి, లావేరు రోడ్డులో ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ ఎల్ దామోదర్‌రావు వ్యాపారస్తులను హెచ్చరించారు. శనివారం పట్టణంలోని జి.అగ్రహారం నుండి ఆంజనేయపురం వరకు, స్థానిక మూడు రోజుల జంక్షన్ నుండి కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం వరకు ఉన్న రహదారులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారికి ఆనుకొని వ్యాపారాలు కొనసాగిస్తున్న వారు రహదారిని ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తే వారిపైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విజయనగరం నుండి చీపురుపల్లి మీదుగా రాజాం వెళ్లే రోడ్డులో రహదారుల్ని ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న పలు దుకాణాల వద్ద వాణిజ్య వస్తువులను తొలగించారు. ట్రాఫిక్ నియంత్రణ దృశ్య రోడ్డును క్లియర్ చేసి రహదారి భద్రతా నియమాలు పాటించాలని కోరారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా వ్యాపారస్తులు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహ సమస్యలపై విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలోని గిరిజన బాలుర కళాశాల వసతిగృహంలో సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. హాస్టల్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి.చిన్నబాబు మాట్లాడుతూ ఆరేళ్లుగా వసతిగృహ సమస్యలను అధికారులకు తెలియజేస్తున్నా పట్టించుకోలేదన్నారు. అదనంగా మరుగుదొడ్లు, అదనపు భవనాలు, ప్రహరీ నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి.రమేష్, జిల్లా నాయకులు భారతి, రత్న మండల నాయకులు అనిత, చరణ్, తిలక్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమించరాదు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు దుకాణాలు నిబంధనలు అతిక్రమించరాదని ఎడిఎ ఎన్. కోటేశ్వరరావు హెచ్చరించారు. శనివారం ఎఒ ఆధ్వర్యంలో సతివాడలో ఎరువుల షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ డీలర్లు విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు నాణ్యతతో కూడినవి ఇవ్వాలని సూచించారు. అధిక రేట్లకు అమ్మడం, బ్లాక్ చేయడం, వంటివి చేయరాదని కొనుగోలు చేసిన ప్రతీ రైతుకు రసీదు ఇవ్వాలని, స్టాక్ రికార్డులు నిర్వహించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటాని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎఒ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

దెంకాడ: మండల కేంద్రంలోని సాయికృష్ణ రైతు మిత్ర గ్రూపు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం షాపులలోని రసాయన ఎరువులు నిల్వను ఎఒ టి.సంగీత శనివారం పరిశీలించారు. యూరియా 60.50 టన్నులు అందుబాటులో ఉందని, రైతులెవరూ ఆందోళన చెందవద్దని తెలిపారు. యూరియా బదులు నానో యూరియా, డిఎపికి బదులు నానో డిఎపి వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రామకోటి, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు మహంతి చిన్ననాయుడు తదితరులు

గవర్నర్ గిరికే వన్నెతెచ్చిన నేత అశోక్

ప్రజాశక్తి - పూసపాటిరేగ

గోవా గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన పూసపాటి అశోక్ గజపతిరాజు గవర్నర్ గిరికే వన్నె తెచ్చిన నేత అని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్ననాయుడు ప్రశంసించారు. శనివారం మండలంలోని రెల్లివలసలో ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్రకు చెందిన వారిలో మొదటిసారి గవర్నర్ గిరి అందుకున్న వ్యక్తిగా అశోక్ గజపతిరాజు నిలిచారని, ఈ ఘనత ఈ ప్రాంత ప్రజలందరికీ గర్వకారణమని తెలిపారు. ఈ పదవికి అర్హతగల నాయకుడిని ఎంపిక చేసిన కేంద్ర ప్రభుత్వానికి, ఆయన పేరును సూచించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఈ ప్రాంత నాయకులు, మేధావులు, విద్యావంతులు కృతజ్ఞతలు తెలుపుతున్నారని అన్నారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు మహంతి శంకర్రావు, నాయకులు ఆకిరి ప్రసాదరావు, కొత్తకోట రమణ, చందకానంద రావు, హరిబాబు, చింతపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంటు సమావేశాల మధ్య శంకుస్థాపన ఏంటి?

పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న సమయంలో కొప్పెర్ల గ్రామంలో ఫైర్ స్టేషన్ శంకుస్థాపన ఎలా నిర్వహించారో అధికారులు సమాధానం చెప్పాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్ననాయుడు కోరారు. శుక్రవారం కొప్పెర్లలో ఫైర్ స్టేషన్‌కు శంకుస్థాపన జరగడంతో, ఇది పూర్తిగా నియమావళికు విరుద్ధమని విమర్శించారు. పార్లమెంటు, అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయడం అనధికారికమన్నారు. ఇది రూల్ పొజిషన్‌కి వ్యతిరేకం అధికారులు దీనిపై స్పష్టత ఇవ్వాలని తెలిపారు. ఇంత పెద్ద కార్యక్రమాన్ని ఇంఛార్జి మంత్రి పంగలూడి అనిత, జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు తదితరులతో కలిసి ప్రారంభించాలని ముందుగా భావించామని, కానీ అనూహ్యంగా తొందరగా శంకుస్థాపన చేయడం దారుణమని విమర్శించారు

కార్గిల్ వీరులకు ఘన నివాళి

ప్రజాశక్తి-విజయనగరంకోట

కార్గిల్ విజయ్ దివాస్‌ను పురస్కరించుకొని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ మేర యువభారత్ , సైనిక్ సంక్షేమ బోర్డు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో కార్గిల్ యుద్ధ విజయంలో ముఖ్యభూమిక పోషించిన జవానులను స్మరించుకుని వారు దేశం కోసం సేవ చేసిన విశ్రాంత సైనిక అధికారులను సత్కరించారు. ఈ సందర్భంగా ప్రతి జవాను పేరు మీద ఒక చెట్టు అనే ఉద్దేశంతో మొక్కల పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి ప్రేమ్ భరత్ కుమార్ మాట్లాడుతూ యువత అగ్నివీర మీద అవగాహన పెంచుకోవాలని ఉన్న అపోహలు తీసివేసి దేశానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. అగ్నివీర్ అవగాహన కోసం యువత కోసం సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సైనిక అధికారి ప్రసాదరావు, ఎన్‌సిసి అధికారి అశోక్, విశ్రాంత సైనిక అధికారులు యువత పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న విశ్రాంత సైనిక అధికారులు

సైనికులకు ఘన నివాళి

బొబ్బిలి : కార్గిల్ యుద్ధంలో మరణించిన సైనికులకు బొబ్బిలిలోని మాజీ సైనిక ఉద్యోగుల సంఘం కార్యాలయం వద్ద కొవ్వొత్తులతో ఘన నివాళులర్పించారు. దేశాన్ని కాపాడేందుకు సైనికులు చేస్తున్న త్యాగాలను మాజీ సైనిక ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఆర్.కిరణ్, గౌరవ అధ్యక్షులు ఎం.రామినాయుడు, కోశాధికారి శర్మ కొనియాడారు. టిఆర్ కాలనీ మున్సిపల్ పాఠశాలలో విద్యార్థులకు ఎస్‌టిఒ పద్మనాభం జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఎన్‌టిఆర్ బొమ్మ వద్ద కార్గిల్ వీరుల చిత్రపటాలకు బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఎం.రామారావునాయుడు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సైన్యంలో చేరి దేశానికి సేవ చేయండి

నెల్లిమర్ల :విద్యార్థులు సైన్యంలో చేరి దేశానికి సేవ చేయాలని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి పిలుపునిచ్చారు. శనివారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో కార్గిల్ విజయ్ దినోత్సవాన్ని జరుపుకున్నారు. 1999 కార్గిల్ యుద్ధంలో పాకిస్తాన్‌పై భారతదేశం సాధించిన విజయానికి గుర్తుగా ప్రతి ఏటా కార్గిల్ విజయ దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ భారత సైనికుల ధైర్యసాహసాలు, త్యాగాలను గౌరవించడానికి కార్గిల్ విజయ్ దివస్‌ను ఏటా జరుపుకుంటున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ శ్రీనివాసరావు, లెఫ్టినెంట్ డాక్టర్ ఎ.సతీష్, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ, ఎన్.సి.సి. విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆరో వార్డులో శనివారం బాబు షూరిటీ - మోసం గ్యారెంటీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చంద్రబాబు మోసం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సావు మురళి, ఎఎంసి మాజీ చైర్మన్ ఇంటి గోపాలరావు, వైసిపి పట్టణ అధ్యక్షులు చోడిగంజి రమేష్ నాయుడు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కూటమి పాలన మోసాల మయం

దెంకాడ : కూటమి పాలనంతా మోసాల మయమని వైసిపి పాలన, టిడిపి పాలన మధ్య తేడాలను గమనించాలని మాజీ ఎమ్మెల్యే బడ్డు కొండ అప్పలనాయుడు అన్నారు. భోగాపురం మండలంలోని ఎం.రాయవలస, గూడపువలస, దల్లిపేట, రెడ్డికంచేరు, కొండరాజుపాలెం గ్రామాల్లో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జరిగిన సమావేశాల్లో బడ్డుకొండ మాట్లాడుతూ గత వైసిపి పాలనలో సంక్షేమ పథకాలతో పేద ప్రజల ఆర్థిక స్థితిగతులు మార్చిన ఘనత వైయస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ మాజీ డైరెక్టర్ ఉప్పాడ శివారెడ్డి, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి సుందర హరీష్, నాయకులు రేగాన శ్రీనివాసరావు, దంతులూరి సూర్యనారాయణ రాజు, పచ్చిపాల గురునాధరావు, సర్పంచులు ఉప్పాడ విజయభాస్కర్ రెడ్డి, పోలిపల్లి వెంకటరమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

వేపాడ : మండలంలోని దబ్బిరాజుపేట, చామలాపల్లి, కరకవలస, జాకేరు, గుడివాడ గ్రామాల్లో శనివారం బాబు షూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపిపి దొగ్గ సత్యవంతుడు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పారావు, వైసిపి మండల అధ్యక్షులు మమ్ములూరు జగన్నాథం ఇంటింటికీ వెళ్లి టిడిపి మోసాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. సర్పంచులు గొంప వేమన రాము, దండుపాటి ముత్యాలమ్మ, కోలా సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన జీవనానికి పరిశోధనలు అవసరం

అడిషనల్ డిఎంహెచ్ఒ కె.రాణి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఆరోగ్యవంతమైన జీవనానికి పరిశోధనలు, నవకల్పనలు ఎంతగానో దోహదపడతాయని అడిషనల్ డిఎంహెచ్ఒ కె.రాణి అన్నారు. గత మూడు రోజులుగా సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో జరిగిన ఇన్నోవేషన్స్ ఇన్ హెల్త్ కేర్ స్మార్ట్ అండ్ అడ్వాన్స్‌డ్ అప్లికేషన్స్ సదస్సు శనివారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కరోనా ముందు పరిస్థితులకు, ఆ తరువాత పరిస్థితులలో మార్పులు వచ్చాయన్నారు. నేడు అంతా స్మార్ట్ లైఫ్‌కు అలవాటు పడ్డారన్నారు. ఇటీవల కాలంలో తాను రెండు ఎఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఉపయోగించి 24వేల మందికి ఎక్స్‌రేలు తీయగలిగామన్నారు. ప్రభుత్వం కూడా మొబైల్ హెల్త్ యాప్, ఆరోగ్యసేతు, ఆయుష్మాన్ భారత్, ఇ-హాస్పిటల్ వంటి సౌకర్యాలను కల్పించిందన్నారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి మాట్లాడుతూ కొత్త విజ్ఞానం పొందడానికి, కేస్ స్టడీస్‌నకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. అనంతరం ముఖ్య అతిథిని వైస్ ఛాన్సలర్ చేతుల మీదుగా శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.పల్లవి, ఒడిషా టెలికామ్ శాఖ నుంచి అడిషనల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎం.మురళీకృష్ణ, డీన్ డాక్టర్ విజయ్ బాబు, డీన్ డాక్టర్ శ్రీనివాసరావు, ఐక్యూఎసి డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డాక్టర్ పిఎస్‌వి రమణారావు, విభాగాధిపతి శ్రావణి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మోటార్ సైకిల్ దొంగ అరెస్ట్

ఐదు బైక్‌లు స్వాధీనం

ప్రజాశక్తి- డెంకాడ

భోగాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మోటార్ సైకిల్ దొంగను పట్టుకొని అతని వద్ద నుంచి ఐదు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నామని డిఎస్‌పి శ్రీనివాసరావు శనివారం తెలిపారు. భోగాపురం పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. స్టేషన్ పరిధిలో రాజాపులోవ వద్ద ఎస్ఐ పాపారావు శుక్రవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా తగరపువలస నుంచి భోగాపురం వైపు ఒక వ్యక్తి మోటార్ సైకిల్ పై వస్తుండగా అతను ఆపి బండి కాగితాలను చూపించమని అడగగా బండికి సంబంధించిన పేపర్లు ఏమీ లేకపోవడంతో